క్లుప్తంగా

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా శుక్రవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో హైదరాబాద్‌కు చెందిన పలువురు నృత్యకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై ఆషానాయుడు కళాబృందంలోని నృత్యకారులు ప్రతిభను ప్రదర్శించారు.

మొబైల్ చలివేంద్రం ప్రారంభం



భవానీపురం(విజయవాడపశ్చిమ): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మొబైల్ చలివేంద్రం దోహదపడుతుందని ఏపీ విశ్వబ్రాహ్మణ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. శ్రీనివాస నిలయం చారిటీస్, వెస్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంచార చలివేంద్రాన్ని ఆయన గొల్లపూడి పరిధిలోని బీసీ సంక్షేమ భవన్ వద్ద శుక్రవారం ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఆల్‌దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవాసంస్థ ఆధ్వర్యాన పలు రంగాల్లో సేవలు అందిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి ఎన్టీఆర్ సేవారత్న, కళారత్న పురస్కారాలను అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ స్థాపకఅధ్యక్షులు డాక్టర్ కేఎస్ఎస్ నారాయణ మాస్టార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 96523 47207 లో సంప్రదించాలని సూచించారు.

రేపు భారతీయ నృత్యపదఝరి

విజయవాడ కల్చరల్: కళావిపంచి, శారదా కళాసమితి ఆధ్వర్యంలో ఈ నెల 14న గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో భారతీయ నృత్యపదఝరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు శంకరావు, నరసింహారావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నృత్య ప్రదర్శనలు జరుగుతాయని పేర్కొన్నారు.

రమణీయం శ్రీనివాస కల్యాణం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ బ్రాహ్మణ వీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శుక్రవారం రమణీయంగా సాగింది. దేవదాయ శాఖ పరిధిలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రం 'శ్రవణ' పురస్కరించుకొని ఆలయంలోని వేదికపై స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. విష్వక్సేన పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. పుణ్యాహవచనం, యజ్ఞోపవీతధారణ, మధుపర్కాల సమర్పణ, జీలకర్ర బెల్లం ధారణ, మాంగల్య ధారణ, తలంబ్రాల సమర్పణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మూలమూర్తికి తిరుమంజనం

వేంకటేశ్వరుడికి తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా శుక్రవారం ఉదయం నిర్వహించారు. అంతరాలయంలో మూలవిరాట్‌కు జరిగే కార్యక్రమాన్ని మంగళవాయిద్యాలు, హరినామస్మరణ, వేదపఠనం, మంత్రోచ్చరణల మధ్య జరిగింది. పంచామృతాల, వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో కూడిన అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగిపల్లి శ్రీరామచంద్రమూర్తి పూజా కార్యక్రమాలు చేశారు. ఈఓ గెల్లి హరిగోపీనాథ్‌బాబు పర్యవేక్షించారు.



శ్రీనివాసుని కల్యాణం

కేబీఎన్‌లో ఎంఎస్సీ డేటా సైన్స్ కోర్సు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని కేబీఎన్ కళాశాలలో రాష్ట్రంలోనే మొదటి సారిగా ఎంఎస్సీ (డేటా సైన్స్) కోర్సును ప్రవేశ పెడుతున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల కమిటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డీమ్డ్ యునివర్సిటీలు మినహా సాధారణ విద్యా కోర్సులను నిర్వహించే కళాశాలల్లో రాష్ట్రంలోనే మొదటి సారిగా తమ సంస్థ ఈ పీజీ కోర్సును ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనుందన్నారు. కంప్యూటర్‌సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ స్టాటిస్టిక్స్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బీవోక్, తదితర డిగ్రీ కోర్సులను పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. బీటెక్‌లో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, ఈ అండ్ ఐటీ కోర్సులు పూర్తి చేసిన వారు సైతం ఈ ఎంస్సీ (డేటా సైన్స్) కోర్సు చేయటానికి అర్హులని తెలిపారు. ఈ సందర్భంగా కోర్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కోర్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు తదితరులు

వాగ్గేయకార చరితం.. సదా స్మరణీయం

విజయవాడ కల్చరల్: వాగ్గేయకార సంగీత చరితం సదా స్మరణీయని గాయకుడు బాలాజీకుమార్ అన్నారు. మెలోడీ గాయనీ గాయకుల ఐక్యవేదిక ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై శుక్రవారం కలిసి పాడుదాం పేరుతో వాగ్గేయకార భక్తి సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు.

బాలాజీకుమార్ మాట్లాడుతూ మనకు తరగని గని ఆధ్యాత్మిక సంగీతమని దాన్ని భావి తరాలకు అందించాల్సిన అవసరముందన్నారు. సంగీత విద్వాంసులు కామేశ్వరి మాట్లాడుతూ రామదాసు, అన్నమయ్య లాంటి వాగ్గేయ కారుల సంకీర్తనలు సమాజంలో చైతన్యం కలిగించాయన్నారు. ఆమె ఆధ్వర్యంలో చిన్నారి శ్రుతి, సీతాదేవి, కామేశ్వరి, డి.పద్మజ, మీనాకుమారి, దిట్టకవి, పవన్‌కుమార్ రామదాసు, అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగరాజ స్వామి దీక్షితార్ రచించిన కీర్తనలు ఆలపించారు. వీటితోపాటు సెమీ క్లాసికల్ గీతాలను, చిన్నారి శ్రుతి ఆలపించిన రామదాసు, విఘ్నేశ్వర కీర్తనలు ఆకట్టుకున్నాయి.



ఆలపిస్తున్న శ్రుతి, పవన్‌కుమార్, మీనాకుమారి, బాలాజీకుమార్, వడ్డాది సూర్యకామేశ్వరి

నర్సుల సేవలు ప్రశంసనీయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రోగులకు వైద్య సేవలు అందిస్తున్న నర్సుల పని తీరు ప్రశంసనీయమని చిట్టినగర్ లంబాడీపేట యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భావన అన్నారు. అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం 47వ డివిజన్‌లోని 147వ వార్డ్ సచివాలయం హెల్త్ సెక్రటరీలు స్పందన, సుధా, పరిమళలను ఆమె సత్కరించారు. సచివాలయ కన్వీనర్లు దేరంగుల వెంకట రమణ, ఇలిపిళ్ల విజయలక్ష్మి, మద్దిరాల కమలాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ భావన మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవాస్ఫూర్తితో రోగులకు నిస్వార్థంగా సేవలు అందించేది నర్సులేనన్నారు. ఏపీ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ దేరంగుల వెంకట రమణ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల ప్రజల ఆరోగ్య పరిరక్షణకు భరోసా ఇచ్చాయన్నారు. కన్వీనర్ మద్దిరాల కమలాకర్ మాట్లాడుతూ రోగులకు వైద్యులు ఇచ్చే మందులు ఎంత ముఖ్యమో నర్సులు చేసే వైద్య సేవలు అంతే ముఖ్యమన్నారు.

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే హాస్పటల్, అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యాన రైల్వే హాస్పటల్ న్యూ ఓపీడీ భవనంలోని కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నిర్వహించారు.

ముఖ్యఅతిథి రైల్వే హాస్పటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల, అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ కన్సల్టెంట్ డాక్టర్ అనిలా పాటిబండ్లతో కలసి ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటం వద్ద నివాళులర్పించి కేక్ కోశారు. కార్యక్రమంలో ఏసీఎంఎస్ డాక్టర్ జయ్‌దీప్, డాక్టర్ వి.సునీల్‌కుమార్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.




కేక్ కోస్తున్న డాక్టర్ శౌరిబాల

నర్సులు.. మాతృమూర్తులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైద్యరంగంలో నిస్వార్థమైన సేవలు అందిస్తున్న నర్సులే నిజమైన మాతృమూర్తులని ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ అన్నారు. అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం స్థానిక గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ హాల్లో నర్సులను సన్మానించారు. విద్యాసాగర్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో నర్సులు ప్రాణాలకు తెగించి సేవలు అందించారన్నారు. అటువంటి నిస్వార్థసేవలు అందిస్తున్న నర్సులను సత్కరించుకోవడం అందరి బాధ్యత అన్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను స్ఫూర్తిగా తీసుకుని నర్సులు తమ సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. అనంతరం దంత వైద్యశాలకు చెందిన కె. శివలీల, వి.రాణి, పాత ప్రభుత్వాస్పత్రికి చెందిన కె. ఇందిరాదేవి, బి.విజయశ్రీ, సీహెచ్ కల్యాణి, టి.తబిత, ఝన్సీ రాణి, నూతన జనరల్ ఆస్పత్రికి చెందిన ఎస్.కె. షమావల్లాబేగం, డి. కనకదుర్గలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి సతీష్ కుమార్, సహాధ్యక్షులు బీవీ రమణ, ఉపాధ్యక్షులు ఎం.రాజబాబు, నగరశాఖ కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మానికి ప్రతిరూపం శ్రీరామచంద్రుడు



ప్రసంగిస్తున్న మల్లాది వెంకటరామనాథశర్మ

విజయవాడ కల్చరల్: మూర్తీభవించిన ధర్మానికి ప్రతీరూపం శ్రీరామచంద్రుడని ఆధ్యాత్మికవేత్త మల్లాది వెంకటరామనాథ శర్మ అన్నారు. అభయాంజనేయ స్వామి జయంతి ఉత్సవంలో భాగంగా సత్యనారాయణపురం మారుతీ వ్యాయామశాలలో శుక్రవారం వెంకటరామనాథ శర్మ సుందరవైభవం, శ్రీమద్రామయణాంతర్గత హనుమత్ వైభవంపై ప్రసంగించారు.

ఆయన మాట్లాడుతూ రాముడు వ్యక్తికాదని ఆధ్యాత్మిక శక్తిగా అభివర్ణించారు. హనుమంతుడులేనిదే రామకథలేదన్నారు. సీతాన్వేషణ సమయంలో హనుమంతుడు లంకకుచేరి సీతాదేవిని చూసి చలించిపోయాడన్నారు. రాముడు ఇచ్చిన ఉంగరం చూపించడంతో రామదూత హనుమంతుడు వచ్చాడని భావించినట్లు తెలిపారు. సర్వకార్యాలను విజయవంతగా చేయడం హన్మత్ లక్షణమన్నారు. సుందరాకాండ పారాయణం సర్వశ్రేయోదాయకమని తెలిపారు. సర్వ కార్యాలు నెరవేరుతాయన్నారు. దేవాలయ పాలకమండలి సభ్యులు హనుమత్ ప్రసాద్ పాల్గొన్నారు.

పార్కు పనుల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): నాణ్యతా ప్రమాణాలతో పార్కు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కృష్ణలంక జాతీయ రహదారి వెంట ఉన్న అంబేద్కర్ పార్కును, కృష్ణానది రిటైనింగ్ వాల్ వెంట నిర్మిస్తున్న రిటైనింగ్ పార్కును వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ పరిశీలించారు. ఆయన శుక్రవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. కనకదుర్గ వారధి నుంచి రామలింగేశ్వర డీపీ స్టేషన్ వరకు 1.5 కి.మీ పొడవున సుమారు రూ.7 కోట్ల వ్యయ అంచనాతో నిర్మిస్తున్న రిటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కులో ట్రీ కెనాపీ, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్ రోడ్లు, బేస్మెంట్ పనులు పరిశీలించారు. అనంతరం ఆయన అంబేద్కర్ పార్కును పరిశీలించి పార్కులో గ్రానైట్ డిజైన్స్‌ను ఆకర్షణీయంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

గ్రీనరీ పరిశీలించి పార్కులో పచ్చదనం పెంపుపై ఏడీహెచ్ మరింత దృష్టి సారించాలన్నారు. వసతుల ఏర్పాటులో అలసత్వం చూపొద్దని ఆదేశించారు. పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.ఎస్.ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.



అంబేద్కర్ పార్కు పనులు పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్

మానవ అక్రమ రవాణా అతి పెద్ద నేరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే అతి పెద్ద నేరమని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఏపీ, తెలంగాణ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ అన్నారు. ప్రజ్వల సంస్థ ఆధ్వర్యంలో 51వ డివిజన్‌లోని పల్లా కనకయ్య కమ్యూనిటీ హాల్లో శుక్రవారం సచివాలయం సిబ్బంది ఇతర కమ్యూనిటీ సిబ్బందికి మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మహిళలు పెద్ద సంఖ్యలో అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు.

వారితో లైంగిక వ్యాపారానికి తెగబడుతున్నారన్నారు. వేలాది మంది తల్లిదండ్రులకు దూరమవుతున్నారని, దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని వివరించారు. నూతన సాంకేతిక మాధ్యమాలు అక్రమ రవాణాకు ఊతమిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజ్వల సంస్థ వివిధ ప్రభుత్వ సంస్థల సాయంతో వేలాది మందిని అక్రమ రవాణా నుంచి కాపాడిందని చెప్పారు. మానవ అక్రమ రవాణాపై లఘుచిత్రాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ కో ఆర్డినేటర్ సురేష్‌కుమార్, ప్రతినిధులు శ్రావ్య, వినోద్‌కుమార్ పోలీసు, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.